సాక్షి విశాఖపట్నం

సోమవారం । 28 । ఏప్రిల్ । 2025



రైల్వేస్టేషన్‌లో విస్తృత తనిఖీలు

కశ్మీర్ పహల్గామ్ ఉగ్రదాడి నేపథ్యంలో వాల్తేర్ డివిజన్ అప్రమత్తమైంది. డివిజన్ పరిధిలోని అన్ని ముఖ్య రైల్వే స్టేషన్ల వద్ద భద్రతను కట్టుదిట్టం చేసింది. గవర్నమెంట్ రైల్వే పోలీసులు, రైల్వే భద్రతా దళం, కమర్షియల్ సిబ్బంది పలు ప్రాంతాల్లో విస్తృతంగా తనిఖీలు చేపడుతున్నారు. రైల్వేస్టేషన్‌కు రాకపోకలు సాగించే ప్రతి ఒక్కరినీ క్షుణ్ణంగా తనిఖీ చేస్తున్నారు. డాగ్ స్క్వాడ్‌తో ప్రయాణికుల లగేజీలను పరిశీలిస్తున్నారు. రైల్వే స్టేషన్‌లో భద్రతా దళాలు అనుక్షణం పహారా కాస్తున్నాయి.

– తాటిచెట్లపాలెం





ఎడారి ఓడ సముద్రపు ఓడ

సాధారణంగా ఎడారిలో కనిపించే ఒంటె.. సాగరతీరంలో విహరించి ఆసక్తికరమైన దృశ్యాన్ని ఆవిష్కరించింది. బీచ్ రోడ్డులోని పాండురంగాపురం సమీపంలో ఇసుక తిన్నెలపై నెమ్మదిగా ఒంటె నడుస్తుంటే.. కొద్ది దూరంలో సముద్ర కెరటాలపై భారీ ఓడ (డ్రెడ్జర్) తేలియాడుతోంది. ఒకే ఫ్రేమ్‌లో ఎడారి ఓడ, సముద్రపు ఓడను 'సాక్షి' తన కెమెరాలో బంధించింది. ఈ దృశ్యం పర్యాటకులను, నగర ప్రజలను ఆకట్టుకుంది.

– ఫొటో: సాక్షి ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం



రైడింగ్ క్వీన్స్

పెదజాలారిపేట బీచ్ ఆదివారం గుర్రాల సకిలింపులు, యువతుల నవ్వులతో మార్మోగింది. సాగర తీరంలో సరదాగా గడపడమే కాదు.. సాహసోపేతమైన గుర్రపు స్వారీని నేర్చుకోవడానికి యువతులు ఉత్సాహం చూపిస్తున్నారు. ఇందుకోసం వేరే ప్రాంతాల నుంచి మంచి జాతి గుర్రాలను, అనుభవజ్ఞులైన శిక్షకులను రప్పిస్తున్నారు. వారానికి ఒక్కరోజు మాత్రమే జరిగే ఈ శిక్షణ తరగతులకు హాజరవుతూ.. ఇసుక తిన్నెలపై గుర్రాలను పరుగులు పెట్టిస్తూ ఎంజాయ్ చేస్తున్నారు.

ఫొటోలు: సాక్షి ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం



ఉగ్రదాడి హేయమైన చర్య



కశ్మీర్‌లో ఉగ్రదాడికి నిరసనగా మార్వాడీ యువ మంచ్, రాజస్థానీ సాంస్కృతిక మండల్, మహావీర్ ఇంటర్నేషనల్ ఆధ్వర్యంలో బీచ్‌రోడ్డులో ఆదివారం ఉదయం శాంతియుత ర్యాలీ నిర్వహించారు. ఉగ్రవాదానికి వ్యతిరేకంగా రాజస్థానీయులు ప్లకార్డులతో ర్యాలీలో పాల్గొన్నారు. కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు నిరంజన్ సామానీ, పూర్వ అధ్యక్షుడు శంకర్ లాల్ శర్మ, పలువురు సభ్యులు పాల్గొన్నారు. ఉగ్రదాడి హేయమైన చర్య అని, తీవ్రవాదం నశించాలని నినదించారు.

– ఏయూక్యాంపస్

న్యూస్‌రీల్

నేడే మేయర్ ఎన్నిక

- కూటమి అభ్యర్థిగా పీలా శ్రీనివాసరావు
- ఏర్పాట్లు పూర్తి చేసిన యంత్రాంగం



డాబాగార్డెన్స్: జీవీఎంసీ మేయర్ ఎన్నికకు అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. రాష్ట్ర ఎన్నికల సంఘం జారీ చేసిన నోటిఫికేషన్ ప్రకారం సోమవారం ఉదయం 11 గంటలకు జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలో మేయర్ ఎన్నిక జరగనుంది. ఈ ఎన్నికకు ప్రిసైడింగ్ అధికారిగా జిల్లా జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్‌ను ప్రభుత్వం నియమించింది. కాగా కూటమి తరపున మేయర్ అభ్యర్థిగా పీలా శ్రీనివాసరావును ప్రకటించారు. టీడీపీ జిల్లా అధ్యక్షుడు గండి బాబ్జీ ఆదివారం పార్టీ కార్యాలయంలో ఆయనకు బీ–ఫారం అందజేశారు. మరోవైపు మేయర్ ఎన్నిక ఏర్పాట్లను జాయింట్ కలెక్టర్ పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. కౌన్సిల్ సభ్యులు, ఎక్స్ అఫీషియో సభ్యులు ఉదయం 10.30 గంటలకు గుర్తింపు కార్డులతో రావాలని సూచించారు.

ఏఎంసీ ప్రిన్సిపాల్‌గా సంధ్యా దేవి

వివిధ ఆస్పత్రుల్లో సూపరింటెండెంట్లుగా ముగ్గురు ప్రొఫెసర్లకు అవకాశం

బీచ్‌రోడ్డు : ఆంధ్ర మెడికల్ కాలేజ్ ప్రిన్సిపాల్‌గా డాక్టర్ కె.వి.ఎస్.ఎం.సంధ్యా దేవిని నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఆదివారం ఉత్తర్వులు జారీ చేసింది. ఏఎంసీ ప్రిన్సిపాల్‌గా డాక్టర్ బుచ్చిరాజు ఉద్యోగ విరమణ పొందిన తరువాత ఆమె తాత్కాలిక ప్రిన్సిపాల్‌గా ఉన్నారు. ఇప్పుడు పూర్తి స్థాయిలో ప్రిన్సిపాల్‌గా కొనసాగనున్నారు. అలాగే ఆంధ్ర మెడికల్ కాలేజీలో ముగ్గురు ప్రొఫెసర్లను వివిధ ప్రభుత్వ ఆసుపత్రులకు సూపరింటెండెంట్లుగా రాష్ట్ర ప్రభుత్వం నియమించింది. ఎండోక్రినాలజీ విభాగంలో ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న డాక్టర్ కె.ఎ.వి.సుబ్రహ్మణ్యంను ఒంగోలు జీజీహెచ్ సూపరింటెండెంట్‌గా.. గైనకాలజీ విభాగంలో ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న డాక్టర్ సి.అమూల్యను శ్రీకాకుళం జీజీహెచ్ సూపరింటెండెంట్‌గా.. జనరల్ సర్జరీ విభాగంలో ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న డాక్టర్ వి.మన్మధరావును మచిలీపట్నం జీజీహెచ్ సూపరింటెండెంట్‌గా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

కొమ్మాది అసిస్టెంట్ లైన్‌మన్ సస్పెన్షన్

- ప్రైవేటు వ్యక్తితో పనిచేయించి మరణానికి కారణం

మధురవాడ : ప్రైవేట్ వ్యక్తితో పనులు చేయించి, ఆయన మరణానికి కారణమైన అసిస్టెంట్ లైన్‌మన్(ఏఎల్‌ఎం) కోటి సుధాకర్‌ను సస్పెండ్ చేస్తున్నట్టు ఈపీడీసీఎల్ జోన్–3 ఈఈ పోలాకి శ్రీనివాసరావు తెలిపారు. ఏపీఎస్‌ఈబీ నిబంధనలకు విరుద్ధంగా డిపార్ట్‌మెంట్ విధుల్ని అనధికారిక వ్యక్తితో చేయించే క్రమంలో ఆయన మరణానికి పరోక్షంగా కారణమైనందుకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించారు. ఈ నెల 25న ఏపీ ట్రాన్స్‌కో విశాఖ జోన్–3 ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కార్యాలయం కొమ్మాది సబ్ స్టేషన్ పరిధిలో ఫ్యూజ్ ఆఫ్ కాల్ పనులు నిర్వహిస్తుండగా కొమ్మాదికి చెందిన దుప్పల వెంకటరమణ(27) అనే అనధికారిక వ్యక్తి విద్యుత్ స్తంభం నుంచి జారిపడ్డాడు. చికిత్స నిమిత్తం సమీపంలోని గాయత్రి ఆస్పత్రిలో చేర్చారు. మెరుగైన చికిత్స కోసం కేజీహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శనివారం రాత్రి మరణించాడు. తాను చెయ్యాల్సిన పనిని, అనధికార వ్యక్తి ద్వారా చేయించి, ఆయన మరణానికి కారణం కావడంతో ఏఎల్‌ఎం కోటి సుధాకర్‌ను సస్పెండ్ చేస్తున్నట్లు ఈఈ శ్రీనివాసరావు తెలిపారు.

రెక్కలు.. ముక్కలు



గణనీయంగా పడిపోయిన వైజాగ్ ఎయిర్‌పోర్ట్ వృద్ధి రేటు

- ఈ ఏడాది మార్చిలో **2,55,835** మంది రాకపోకలు
- గతేడాది మార్చిలో **2,17,243** మంది ప్రయాణం
- గత మార్చితో పోలిస్తే కేవలం **17.8** శాతం మాత్రమే వృద్ధి
- కూటమి సర్కారు నిర్వాకంతో పలు విమాన సర్వీసుల రద్దు
- పట్టించుకోని కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు
- ఏప్రిల్ నెలలో మరింత దిగజారనున్న వృద్ధి రేటు

విశాఖ అంతర్జాతీయ విమానాశ్రయం భవిష్యత్తును కూటమి ప్రభుత్వం కాలరాస్తోంది. గత ప్రభుత్వం చూపించిన శ్రద్ధతో ఎయిర్‌పోర్టు కొత్త రెక్కలు తొడుక్కుంది. నవ్య రూపం సంతరించుకుని అంతర్జాతీయ సర్వీసులను ఆకర్షించింది. కూటమి ప్రభుత్వం దీనికి రివర్స్‌లో విమానం రెక్కలు విరిచేసింది. దీంతో ఎయిర్‌పోర్టు వృద్ధి రేటులో తిరోగమనం దిశగా పయనిస్తోంది.



సాక్షి, విశాఖపట్నం : ఏడాది క్రితంతో పోలిస్తే విశాఖ విమానాశ్రయంలో విమాన సర్వీసులు, ప్రయాణికుల వృద్ధి క్రమంగా క్షీణిస్తోంది. కోవిడ్ తర్వాత మొదటిసారిగా ప్రయాణికుల రాకపోకల వృద్ధి రేటు 20 శాతం దిగువకు పడిపోవడమే దీనికి నిదర్శనం. గతంలో కనీసం 50 నుంచి 100 శాతానికి పైగా వృద్ధి నమోదయ్యేది. కానీ ఈ ఏడాది మార్చిలో కేవలం 17 శాతానికే పరిమితమైంది. ప్రభుత్వ నిర్లక్ష్యం, కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు చేతకానితనం వల్ల ప్రయాణికుల రాకపోకల వృద్ధి రికార్డు స్థాయిలో తగ్గిపోయిందని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు ఉత్తరాంధ్రకు చెందిన వారైనా.. విమాన సర్వీసులు రద్దవుతున్నా పట్టించుకోకపోవడంపై ఆగ్రహం వ్యక్తమవుతోంది. కొన్ని సర్వీసులు ఇతర ప్రాంతాలకు తరలించేయడం.. కొత్త సర్వీసులకు ప్రభుత్వం నుంచి ప్రోత్సాహం లేకపోవడంతో ఈ పరిస్థితి దాపురించింది.

మార్చిలో 17 శాతం వృద్ధి మాత్రమే.!

ప్రతి నెలా దేశీయ, అంతర్జాతీయ విమానాల్లో విశాఖ ఎయిర్‌పోర్టు నుంచి ప్రయాణిస్తున్న ప్రయాణికుల సంఖ్యను గణిస్తుంటారు. గతేడాది అదే నెలలో జరిగిన రాకపోకలతో పోల్చి వృద్ధి రేటు నమోదు చేస్తారు. ఈ వృద్ధి రేటు ఆధారంగా ప్రయాణికుల సంఖ్య గణనీయంగా పెరిగినట్లు కనిపిస్తే ఎయిర్‌లైన్స్ సంస్థలు.. కొత్త సర్వీసులు నడిపేందుకు పోటీ పడుతుంటాయి. 2024 నవంబర్ వరకూ వైజాగ్ ఎయిర్‌పోర్టు గణనీయంగా వృద్ధి నమోదు చేసింది. దేశీయ విమాన సర్వీసుల్లో 80 నుంచి 100 శాతం వరకూ, అంతర్జాతీయ సర్వీసుల్లో 90 నుంచి 150 శాతం వరకూ వృద్ధి కనిపించింది. ఎప్పుడైతే కూటమి ప్రభుత్వం విశాఖను విస్మరించిందో అప్పటి నుంచి సర్వీసులు తగ్గిపోయాయి. ఫలితంగా ప్రయాణికుల వృద్ధి కూడా దారుణంగా పడిపోయింది. ఈ ఏడాది మార్చిలో 2,55,835 మంది ప్రయాణికులు డొమెస్టిక్, ఇంటర్నేషనల్ సర్వీసుల్లో ప్రయాణించారు. 2024 మార్చిలో 2,17,243 మంది ప్రయాణికులు రాకపోకలు సాగించారు. ప్రయాణికుల సంఖ్య అంతగా పెరగకపోవడంతో వృద్ధి కేవలం 17.8 శాతం మాత్రమే నమోదైంది. గత ఐదేళ్ల కాలంలో కోవిడ్ మినహాయిస్తే.. ఇదే అత్యల్పం కావడం దురదృష్టకరం.

వచ్చిన విమానాలు వచ్చినట్లే మాయం

మార్చిలో 20 శాతం దిగువన నమోదైతే.. ఏప్రిల్‌లో మరింత దిగువకు పడిపోయే అవకాశాలు పుష్కలంగా ఉన్నాయి. ఏప్రిల్‌లో విజయవాడ సర్వీసులతో పాటు మరికొన్ని సర్వీసులు నిలిచిపోయాయి. దీంతో ప్రయాణించే వారి సంఖ్య కూడా తగ్గిపోతోంది. ఇటీవల దుబాయ్ విమానం వైజాగ్ రాకుండా కూటమి సర్కారు అడ్డుకొని విజయవాడకు తరలించేసింది. అదే నిర్లక్ష్యంతో వియత్నాం విమాన సర్వీసు హైదరాబాద్‌లో ల్యాండ్ అయిపోయింది. ఇటీవలే బ్యాంకాక్, కౌలాలంపూర్ విమాన సర్వీసులు కూడా నిలిపేస్తున్నామని ప్రకటించాయి. విజయవాడ సర్వీసు ఆగిపోయింది. మిగిలిన డొమెస్టిక్ సర్వీసుల విషయంలోనూ అదే నిర్లిప్తంగా ప్రభుత్వం వ్యవహరిస్తోంది. దీంతో వైజాగ్ వచ్చేందుకు ఎయిర్‌లైన్స్ ఆసక్తి చూపిస్తున్నా కూటమి ప్రభుత్వం మాత్రం రాకుండా మోకాలడ్డుతోంది. ఇలాగే కొనసాగితే వైజాగ్ ఎయిర్‌పోర్టు నుంచి కొత్త సర్వీసులు వచ్చేందుకు అవకాశాలు దాదాపు సన్నగిల్లిపోతాయని ప్రజలు, అసోసియేషన్లు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

చందనోత్సవంలో సామాన్యులకే పెద్ద పీట

- హోంమంత్రి వంగలపూడి అనిత



ఏర్పాట్లను పరిశీలిస్తున్న హోం మంత్రి అనిత

సింహాచలం: ఈనెల 30న జరిగే చందనోత్సవంలో సామాన్య భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా అప్పన్న స్వామి నిజరూపదర్శనం కల్పించడమే లక్ష్యంగా ప్రభుత్వ యంత్రాంగం పనిచేస్తోందని రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత అన్నారు. సింహగిరిపై జరుగుతున్న చందనోత్సవ ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ హరేందిరప్రసాద్, సీపీ శంఖబ్రత బాగ్చిలతో కలిసి ఆదివారం పరిశీలించారు. భక్తులకు కల్పించిన సౌకర్యాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మీడియాతో మాట్లాడుతూ అంతరాలయ దర్శనాలు ఉదయం 3 గంటల నుంచి 6 గంటలలోపు మాత్రమే ఉంటాయన్నారు. ఉదయం 6 తర్వాత అంతరాలయ దర్శనాలు ఉండవని స్పష్టం చేశారు. ఈ తరుణంలో అంతరాలయ తలుపులు మూసివేసి తాళాలు వేసుకుని దగ్గర ఉంచుకోవాలని ఆలయ వైదికులు, అధికారులకు సూచించారు. దివ్యాంగులు, వృద్ధులకు, ఏడాదిలోపు వయసున్న పిల్లలు ఉన్నవారికి లిఫ్ట్ ద్వారా తీసుకెళ్లి, దర్శనం కల్పిస్తామన్నారు. చందనోత్సవం రోజు ఏటా లక్షా 30 వేల వరకు భక్తుల సంఖ్య ఉంటోందని, ఎన్డీయే ప్రభుత్వం వచ్చాక శ్రీశైలం, కోటప్పకొండ, శ్రీకాళహస్తి, విజయవాడ, తిరుపతి తదితర ప్రముఖ క్షేత్రాల్లో భక్తుల సంఖ్య దాదాపు 30 శాతం పెరిగిందన్నారు. దీంతో సింహాచలంలో ఈసారి చందనోత్సవానికి సుమారు రెండు లక్షల మంది వస్తారని అంచనా వేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో జేసీ మయూర్ అశోక్, దేవదాయశాఖ ఇన్‌చార్జి కమిషనర్ కె.రామచంద్రమోహన్, దేవస్థానం ఈవో కె.సుబ్బారావు పాల్గొన్నారు.

2 వేల మందితో బందోబస్తు

చందనోత్సవానికి 2 వేల మందితో బందోబస్తు కల్పిస్తున్నట్లు సీపీ శంఖబ్రత బాగ్చి తెలిపారు. భక్తులకు ఇబ్బంది లేకుండా దర్శనాలు కల్పించడం జరుగుతుందన్నారు.

సింహగిరికి పోటెత్తిన భక్తజనం



వరాహ పుష్కరిణి వద్ద కోలలకు పూజలు నిర్వహిస్తున్న భక్తులు

సింహాచలం: గంధం అమావాస్య పురస్కరించుకుని సింహగిరికి ఆదివారం భక్తులు పోటెత్తారు. శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామిని ఇలవేల్పుగా పూజించే ఉత్తరాంధ్ర జిల్లాల్లోని మత్స్యకారులు, గ్రామీణ ప్రాంత భక్తులు కుటుంబ సమేతంగా తరలివచ్చారు. శనివారం రాత్రికే సింహాచలం చేరుకున్న వీరంతా ఆదివారం తెల్లవారుజాము మూడు గంటల నుంచే కొండ దిగువ వరాహ పుష్కరిణిలో స్నానాలు ఆచరించారు. స్వామి ప్రతిరూపాలుగా వెంట తీసుకొచ్చిన కోలలను పుష్కరిణి గట్టుపై ఉంచి పూజలు నిర్వహించారు. వంటలు వండి, కోలలకు ఆరగింపు చేశారు. అమృత కలశాలను, పళ్లను సమర్పించారు. కుటుంబ సమేతంగా సహపంక్తి భోజనాలు చేశారు. మెట్ల మార్గం ద్వారా నడిచి వెళ్లి స్వామిని దర్శించుకున్నారు. కోలలతో నృత్యాలు చేస్తూ స్వామిని కీర్తించారు. స్నానమాచరించేందుకు అధిక సంఖ్యలో తరలివచ్చిన భక్తులతో వరాహ పుష్కరిణి ప్రాంగణం అంతా కిటకిలాడింది. పుష్కరిణి నుంచి అడవివరం మార్కెట్ కూడలి వరకు ఉన్న



స్నానాలు ఆచరించేందుకు వరాహ పుష్కరిణికి వచ్చిన భక్తజన సందోహం

మార్గం భక్తజన సంద్రంగా మారింది. సింహగిరిపై దర్శనక్యూలు, కేశఖండనశాల, ప్రసాద విక్రయశాల, గంగధార మార్గం భక్తులతో కిటకిటలాడాయి. సింహగిరికి చేరుకున్న భక్తులు సింహగిరిపై కూడా కోలలకు పూజలు నిర్వహించారు. గరిడి నృత్యాలు చేశారు. దేవస్థానం ఇన్‌చార్జి ఈవో కె.సుబ్బారావు ఆధ్వర్యంలో ఇంజినీరింగ్ అధికారులు ఏర్పాట్లు పర్యవేక్షించారు. పుష్కరిణి వద్ద ఎలాంటి ప్రమాదాలు జరగకుండా గోపాలపట్నం పోలీసులు, దేవస్థానం గార్డులు బందోబస్తు నిర్వహించారు.

గ్రీన్ షెల్టర్లకు రెడ్ సిగ్నల్



- మొక్కుబడిగా చలివేంద్రాల నిర్వహణ
- పట్టించుకునే అధికారి లేకపోవడంతో ఎండల బారిన ప్రజలు
- మౌలిక సదుపాయాల కల్పనలో కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యం

డాబాగార్డెన్స్: ఎండలు మండుతున్నాయి. నానాటికీ ఉష్ణోగ్రతలు అనూహ్యంగా పెరుగుతున్నాయి. ఉదయం 9 గంటలకు మొదలైన భానుడి ప్రతాపం సాయంత్రం 6 గంటలకు గాని తగ్గట్లేదు. ఉక్కపోత, వడగాడ్పులతో ప్రజలు ఉక్కిరిబిక్కిరవుతున్నారు. ఏప్రిల్‌లోనే ఇలా ఉంటే.. ఇక మే నెలలో ఎలా ఉంటాయోనని ఆందోళన చెందుతున్నారు. తప్పనిసరి పరిస్థితుల్లో, దైనందిన విధుల్లో భాగంగా రోడ్లపైకి వచ్చే ప్రజలకు అవసరమైన కనీస వసతుల కల్పనలో కూటమి పాలకులు విఫలమయ్యారనే చెప్పొచ్చు.

గాడి తప్పిన జీవీఎంసీ పాలన

జీవీఎంసీకి పూర్తిస్థాయి కమిషనర్ లేరు. మూడు నెలలుగా ఇన్‌చార్జ్ కమిషనర్ పాలనలోనే జీవీఎంసీ ఈదుతోంది. దీంతో జీవీఎంసీ అధికారుల్లో జవాబుదారీ తనం కరువైంది. 35 డిగ్రీల పైబడి ఉష్ణోగ్రతలు నమోదవుతున్నా, నగరవాసులకు కనీస వసతుల కల్పనలో కూటమి ప్రభుత్వం ఫెయిలైందని ప్రజలు ఆక్షేపిస్తున్నారు. ఆస్తి పన్నులు చెల్లించకపోతే జప్తు చేస్తామని బెదిరిస్తున్న అధికారులు, మండుతున్న ఎండల నేపథ్యంలో గ్రీన్‌షెల్టర్లు, చలివేంద్రాలపై దృష్టి సారించకపోవడంపై మండిపడతున్నారు. గతంలో జీవీఎంసీ ఆధ్వర్యంలో 98 వార్డుల్లోని ప్రధాన కూడళ్లు, ఐలాండ్లు, జాతీయ రహదారుల వెంబడి, ట్రాఫిక్ సిగ్నల్ పాయింట్ల వద్ద చలివేంద్రాలు, గ్రీన్‌షెల్టర్లను విరివిగా ఏర్పాటు చేసేవారు.

గతంలో ఇలా..

గత ప్రభుత్వ హయాంలో జీవీఎంసీ పరిధిలో చలివేంద్రాలతో పాటు 63 గ్రీన్ షెల్టర్స్ ఏర్పాటు చేశారు. జోన్–1 పరిధిలో 10 చలివేంద్రాలు, 4 గ్రీన్ షెల్టర్స్, జోన్–2లో 13 చలివేంద్రాలు, 7 గ్రీన్ షెల్టర్స్, జోన్–3లో 26 చలివేంద్రాలు, 4 గ్రీన్ షెల్టర్స్, జోన్–4లో 25 చలివేంద్రాలు, 6 గ్రీన్‌షెల్టర్స్, జోన్–5ఏ పరిధిలో 29 చలివేంద్రాలు, 5 గ్రీన్‌షెల్టర్స్, జోన్–5బీ పరిధిలో 13 చలివేంద్రాలు, 3 గ్రీన్‌షెల్టర్స్, జోన్–6 పరిధిలో 31 చలివేంద్రాలు, 16 గ్రీన్‌షెల్టర్స్, జోన్–7 పరిధిలో 12 చలివేంద్రాలు, 12 గ్రీన్‌షెల్టర్స్, జోన్–8 పరిధిలో 18 చలివేంద్రాలు, 6 గ్రీన్‌షెల్టర్స్ ఏర్పాటు చేసి పాదచారుల దాహార్తి, వాహనచోదకులకు ఉపశమనం కల్పించారు.



మొక్కుబడిగా హరితాశ్రయాలు

నగరంలో పలు ప్రాంతాల్లో జీవీఎంసీ ఏర్పాటు చేసిన హరితాశ్రయాలు లక్ష్యానికి దూరంగా ఉంటున్నాయి. నిర్వహణ లోపాలు, పర్యవేక్షణ కొరవడటంతో లక్ష్యం నెరవేరడం లేదు. కొన్ని ప్రాంతాల్లో వీటి చుట్టూ ఆకుపచ్చని తెరను సరిగా ఏర్పాటు చేయలేదు. దీంతో ఎండ సమయంలో దీనిలో కూర్చునే అవకాశం ఉండడం లేదు. కొన్ని చోట్ల శునకాలు వీటిలో తిష్టవేస్తున్నాయి. అధికారులు హరితాశ్రయాలలో తాగునీరు సైతం ఏర్పాటు చేస్తే నగరవాసులకు ఎంతో ఉపయుక్తంగా ఉంటుంది.

నగర ప్రజల శ్రేయస్సు దృష్ట్యా..



నగర ప్రజల శ్రేయస్సు దృష్ట్యా రూ.కోటితో 177 చలివేంద్రాలు, 63 గ్రీన్ షెల్టర్స్‌ను గతంలో ఏర్పాటు చేశాం. ముఖ్యంగా ఐలాండ్లు, హైవే, ముఖ్య కూడళ్ల వద్ద జీవీఎంసీ ఆధ్వర్యంలో వీటిని ఏర్పాటు చేశాం. అధికార యంత్రాంగం వీటిని సక్రమంగా నిర్వహించాలి.

– గొలగాని హరి వెంకటకుమారి, మాజీ మేయర్

సృజనాత్మకత.. నృత్య ఘనత



- వైవిధ్య నృత్యాలకు వేదిక 'స్కూల్ ఆఫ్ థియేటర్ ఆర్ట్స్'
- దేశ విదేశీ నృత్యాల్లో బాల కళాకారులకు శిక్షణ
- అంతర్జాతీయ స్థాయిలో ప్రదర్శనలు, ప్రశంసలు



నృత్య ప్రదర్శన కోసం నేపాల్ వెళ్లిన కళాకారులు(ఫైల్)

సీతమ్మధార: నగరంలోని 'స్కూల్ ఆఫ్ థియేటర్ ఆర్ట్స్' జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో తనదైన ముద్ర వేస్తోంది. బాలబాలికలకు వివిధ రకాల నృత్య రీతుల్లో శిక్షణ ఇస్తూ.. వారి సృజనాత్మకతను వెలికితీస్తోంది. భారతీయ శాస్త్రీయ నృత్యాలైన కథక్, మోహినియాట్టం, ఒడిస్సీ, మణిపురితో పాటు సంబల్పూరి, కోలాటం, రాజస్థానీ, కర్ణాటక, బిహు, పంజాబీ, తెలుగు జానపద, శాస్త్రీయ నృత్యాల్లో ఇక్కడ శిక్షణ ఇస్తున్నారు. అంతేకాకుండా నేపాలి, ఇండోనేషియా, శ్రీలంక వంటి దేశాల నృత్యరీతులను కూడా నేర్పిస్తున్నారు. అనకాపల్లి, పెందుర్తి, భీమునిపట్నం, సింహాచలం తదితర ప్రాంతాల నుంచి ప్రతి ఆదివారం సీతమ్మధార ఏపీఎస్ఈబీ కాలనీలోని నృత్యాలయానికి విద్యార్థులు వచ్చి మూడు గంటల పాటు ప్రత్యేక శిక్షణ పొందుతున్నారు. శ్రీకాకుళం, రాజాం, చీపురుపల్లి ప్రాంతాలకు చెందిన బాల కళాకారులు రెండు, మూడు రోజుల పాటు నిర్వహించే ప్రత్యేక సదస్సుల్లో పాల్గొని సృజనాత్మక నృత్యాంశాలు నేర్చుకుంటున్నారు. ఈ సంస్థకు అనుబంధంగా ఉన్న శ్రీలంక, ఒడిశా, బంగ్లాదేశ్, నేపాల్, కర్ణాటక, కేరళ, కోల్‌కతా వంటి ప్రాంతాల నుంచి శిక్షకులు వచ్చి బాలలకు ప్రత్యేక తరగతులు నిర్వహించడంతో పాటు ప్రశంసా పత్రాలు అందిస్తున్నారు. ఇక్కడ శిక్షణ పొందుతున్న విద్యార్థులు టర్కీలోని ఇస్తాంబుల్, బల్గేరియా, సుబంగ్ (ఇండోనేషియా)లలో ప్రతి ఏటా జరిగే అంతర్జాతీయ ఆన్‌లైన్ నృత్య పోటీల్లో పాల్గొని బహుమతులు సాధిస్తున్నారు. థాయిలాండ్,శ్రీలంక, ఇండోనేషియా వంటి దేశాల్లో నిర్వహించే అంతర్జాతీయ ఆహ్వాన నృత్య ప్రదర్శన పోటీలకు హాజరై.. భారతీయ జానపద, శాస్త్రీయ నృత్యాల గొప్పతనాన్ని ప్రపంచానికి చాటి చెబుతున్నారు.

వైవిధ్యం కోసం నేర్చుకుంటున్నాను



డ్యాన్స్ అంటే నాకు చాలా ఇష్టం. స్కూల్ ఆఫ్ థియేటర్ ఆర్ట్స్‌లో బంగ్లాదేశ్, నేపాల్, పశ్చిమబెంగాల్ ప్రాంతాలకు చెందిన డ్యాన్స్‌లు నేర్చుకున్నాను. దేశంలోని అనేక ప్రాంతాల్లో ప్రదర్శనలిచ్చాను. టర్కీలో జరిగిన పోటీల్లో విజయం సాధించడం మరిచిపోలేను. క్రియేటివ్ డ్యాన్స్‌లకు ఆదరణ ఎక్కువ. అమ్మానాన్నల ప్రోత్సాహంతో పన్నెండేళ్లుగా శిక్షణ పొందుతున్నాను.

– గోక డింపుల్, ఏయూ ఇంజినీరింగ్ విద్యార్థిని

అంతర్జాతీయ ప్రశంసలే ప్రోత్సాహం



విదేశాల్లో భారత దేశ నృత్యాంశాలు ప్రదర్శించేటప్పుడు లభించే ప్రశంసలే నాకు ప్రోత్సాహాన్ని ఇస్తున్నాయి. టర్కీ, ఇండోనేషియా, సింగపూర్, థాయ్‌లాండ్‌లలో ప్రదర్శించే అవకాశాలు లభించడం మరువలేనిది. విదేశీ కళాకారులు సైతం భారతీయ శాస్త్రీయ, జానపద నృత్యాలకు ముగ్ధులవుతున్నారు.

– ఆర్.హర్షిత టీనా,తగరపువలస



అంతర్జాతీయ వేదికపై నృత్యం చేస్తున్న కళాకారులు(ఫైల్)

బహుభాషా నృత్యాలు బాగుంటాయి



ఒడిస్సీ, కథక్, మణిపురి, కర్ణాటక జానపద నృత్యాలను ప్రదర్శిస్తాను. బహుభాషా నృత్యాలు బాగుంటాయి. అందుకే ఆసక్తిగా నేర్చుకుంటున్నాను. కేంద్ర ప్రభుత్వం న్యూఢిల్లీలో నిర్వహించిన జాతీయ బాలల సాంస్కృతిక ఉత్సవాల్లో పూజిత చందన (విశాఖ), ఎస్.జోషిత (సింహాచలం)లతో కలసి నృత్య ప్రదర్శనలిచ్చాను. కళాభిమానులు, నిర్వాహకుల అభినందనలు అందుకున్నాం. మన జానపద నృత్యాలకు విదేశాల్లో చూపుతున్న ఆదరణ.. నాలో ఆసక్తిని మరింత పెంచుతోంది.

–డి.లక్ష్మీస్నేహిత, ఇంటర్ విద్యార్థిని, అనకాపల్లి

తెలిసిన వారి పనేనా?

కొలిక్కిరాని దంపతుల హత్య కేసు



యోగేంద్రబాబు,లక్ష్మి నివాసం ఉన్న ఇల్లు

కూర్మన్నపాలెం: రాజీవ్‌నగర్‌లో జరిగిన దంపతుల హత్య కేసు ఇంకా కొలిక్కి రాలేదు. తొలుత ఈ హత్యలను దోపిడీ దొంగలే చేసి ఉంటారని పోలీసులు, స్థానికులు భావించారు. ఆ కోణంలోనే పోలీసులు దర్యాప్తును ముమ్మరం చేశారు. అయితే విదేశాల నుంచి వచ్చిన మృతుల కుమార్తె, కుమారుడు ఇంట్లోని బీరువాలను తెరిచి పరిశీలించగా.. అందులో నగదు, బంగారు నగలు చెక్కు చెదరకుండా ఉన్నట్లు గుర్తించారు. పోలీసుల సమక్షంలోనే బీరువాలను పరిశీలించగా 30 తులాల బంగారం, రూ. 10 వేల నగదు సురక్షితంగా ఉన్నట్లు తేలింది. దీంతో ఈ హత్యలు డబ్బు లేదా ఆభరణాల కోసం జరగలేదని స్పష్టమైంది. ఈ కీలక పరిణామంతో హత్యలపై పోలీసుల దర్యాప్తు కోణం మరో మలుపు తిరిగింది. ఘటనా స్థలంలోని పరిస్థితులు, హత్యకు ఉపయోగించిన ఆయుధాలను పరిశీలిస్తే.. వారికి బాగా తెలిసిన వారే ఈ ఘాతుకానికి పాల్పడి ఉంటారని పోలీసులు అనుమానిస్తున్నారు. వంట గదిలో కూరగాయలు కోసేందుకు ఉపయోగించే రెండు కత్తులతోనే ఈ హత్యలు జరిగినట్లు ప్రాథమిక దర్యాప్తులో తేలింది. ఇంటితో బాగా పరిచయం ఉన్న వారికే వస్తువులు ఎక్కడ ఉంటాయో తెలుస్తుందని భావిస్తున్న పోలీసులు.. ఇప్పుడు దర్యాప్తును ఆ దిశగా మళ్లించారు. దీంతో మృతుల కుటుంబంతో సన్నిహిత పరిచయాలున్న వారిని, ఇంటికి తరచుగా వచ్చిపోయే వారిని, ఆ కుటుంబ సభ్యులకు చనువుగా ఉండేవారి వివరాలను సేకరించి.. వారిని ప్రశ్నిస్తున్నారు. ఈ దారుణ ఘటనపై నగర పోలీసు ఉన్నతాధికారులు ఇక్కడే ఉండి క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు. క్రైం పోలీసులు, అధికారులు మఫ్టీలో ఆ ప్రాంతమంతా జల్లెడ పడుతున్నారు. ఇప్పటివరకు స్పష్టమైన ఆధారాలు దొరక్కపోవడంతో.. కేసును ఎలా ముందుకు తీసుకెళ్లాలో తెలియక ఉన్నతాధికారులు తలలు పట్టుకుంటున్నారు.

'మహా బోధి విహార్‌ను బౌద్ధులకే అప్పగించండి'



శాంతియాత్రలో పాల్గొన్న ఉత్తరాంధ్ర బౌద్ధ సంఘాల ఐక్య వేదిక నేతలు

సీతమ్మధార: బిహార్‌లోని మహా బోధి విహార్ నిర్వహణ బాధ్యతలను పూర్తిగా బౌద్ధులకే అప్పగించాలని ఉత్తరాంధ్ర బౌద్ధ సంఘాల ఐక్య వేదిక నేతలు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారం ఎల్ఐసీ బిల్డింగ్ అంబేడ్కర్ విగ్రహం నుంచి జీవీఎంసీ కార్యాలయం వరకు మహా శాంతి యాత్ర నిర్వహించారు. అనంతరం జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద వారంతా నిరసన దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా జేఏసీ నేతలు మాట్లాడుతూ మహా బోధి విహార్‌ను యునెస్కో ప్రపంచ వారసత్వ సంపదగా గుర్తించిందన్నారు. అటువంటి ఈ విహార్ నిర్వహణ బాధ్యతలను పూర్తిగా బౌద్ధులకే ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు. కానీ అక్కడి రాష్ట్ర ప్రభుత్వం బి.టి.ఎం.సి.యాక్ట్ 1949 ప్రకారం చట్టం చేసి.. అందులో నలుగురు హిందూ మహంతులు, నలుగురు బౌద్ధ భిక్షువులతో పాటు కలెక్టర్‌ను చైర్మన్‌గా కమిటీని ఏర్పాటు చేసిందన్నారు. మొత్తం 9 మంది సభ్యుల్లో ఐదుగురు హిందువులే ఉండేలా చేసి.. ఆలయ అభివృద్ధి, విధానపరమైన నిర్ణయాల్లో బౌద్ధులకు ఎటువంటి ప్రాధాన్యత లేకుండా చేసిందని మండిపడ్డారు. మహా విహార విముక్తి ఆందోళనలో ఉత్తరాంధ్ర జిల్లాల జేఏసీ కన్వీనర్ వి.వి.దుర్గారావు, కో కన్వీనర్ బి.వి.జి.గౌతమ్, జేఏసీ చీఫ్ అడ్వైజర్ డాక్టర్ మాటూరు శ్రీనివాస్, భీమ్ సేన్ వార్ జనరల్ సెక్రటరీ డాక్టర్ వసంత రాజేంద్రప్రసాద్, మాటూరి శ్రీనివాసరావు, పేకేటి రామారావు, ఎం.మల్లయ్య రాజు, తదితరులు పాల్గొన్నారు.

జిల్లాకు చేరుకున్న పాఠ్య పుస్తకాలు



పుస్తకాలు పరిశీలిస్తున్న డీఈవో ప్రేమ్‌కుమార్

ఆరిలోవ: 2025–26 విద్యా సంవత్సరానికి సంబంధించి ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు అందజేసేందుకు మొదటి విడత పాఠ్య పుస్తకాలు జిల్లాకు చేరుకున్నాయి. తోటగరువు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన స్టాక్ పాయింట్‌లో వీటిని భద్రపరిచారు. ఈ కేంద్రాన్ని డీఈవో ఎన్.ప్రేమ్‌కుమార్ ఆదివారం సందర్శించి, పుస్తకాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చినగదిలి మండలంలో ఒకటో తరగతి నుంచి పదో తరగతి వరకు చదివే విద్యార్థులకు అవసరమైన పాఠ్య పుస్తకాలు, వర్క్ బుక్స్ మొదటి విడతగా 31,560 పుస్తకాలు చేరినట్లు తెలిపారు. రెండో విడతలో మరో 34 వేల పుస్తకాలు వస్తాయన్నారు. సీఎంవో దేముడు బాబు, చినగదిలి ఎంఈవోలు సీహెచ్.రవీంద్ర బాబు, పి.అనురాధ, సీఆర్పీలు పాల్గొన్నారు.

ఉత్సాహంగా రైల్వే వేసవి క్రీడా శిబిరాలు



శిబిరాల్లో భాగంగా యోగా చేస్తున్న చిన్నారులు

విశాఖ స్పోర్ట్స్: యువ ప్రతిభను పెంపొందించడం, క్రీడాస్ఫూర్తిని చిరుప్రాయం నుంచే అలవరిచే లక్ష్యంతో రైల్వేలో నిర్వహిస్తున్న వేసవి క్రీడా శిక్షణా శిబిరాలు ఉత్సాహంగా సాగుతున్నాయి. ఈస్ట్ కోస్ట్ రైల్వే క్రీడా సంఘం(ఈకోర్సా) వాల్తేర్ ఆధ్వర్యంలో ఈనెల 22న ప్రారంభమైన క్రీడా శిబిరాలు నెలాఖరు వరకూ సాగనున్నాయి. 5 నుంచి 15 ఏళ్ల చిన్నారులు సుమారు 200 మంది ఈ శిబిరాల్లో తర్ఫీదు పొందుతున్నారు. ఇదిలా వుండగా ఆదివారం ఈకోర్సా డబ్ల్యూడబ్ల్యూవో అధ్యక్షురాలు జ్యోత్స్న బోహ్రా మార్గదర్శకంలో యోగా శిబిరంలో మరింత ఉత్సాహంగా సాగింది. యువతలో ఆరోగ్యకరమైన అలవాట్లు, మానసిక శ్రేయస్సును పెంపొందించడం లక్ష్యంగా యోగాతో పాటు స్విమ్మింగ్ లోనూ శిక్షణ కొనసాగుతుంది. ఉదయం 6 నుంచి 8 వరకు, సాయంత్రం 4.30 నుంచి 6 గంటల వరకు రెండు సెషన్స్‌లో ఈ శిబిరం ప్రతీ రోజూ జరుగుతుంది. బాలురకు క్రికెట్, బాల్ బ్యాడ్మింటన్, ఫుట్‌బాల్, వాలీబాల్‌లో శిక్షణ ఇస్తుండగా బాక్సింగ్, బాస్కెట్‌బాల్, స్విమ్మింగ్, టేబుల్ టెన్నిస్, టెన్నిస్, బ్యాడ్మింటన్, యోగాలో బాలబాలికలకు శిక్షణ నిర్వహిస్తున్నారు.

మే 20న జాతీయ సమ్మె

లేబర్ కోడ్స్, ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ కార్మిక సంఘాల పిలుపు



మాట్లాడుతున్న సిటు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నరసింగరావు

డాబాగార్డెన్స్: కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్‌ల రద్దు, విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ నిలుపుదల, కాంట్రాక్ట్ కార్మికుల తొలగింపులు ఆపాలని డిమాండ్ చేస్తూ అఖిలపక్ష కార్మిక సంఘాలు మే 20న జాతీయ సమ్మెకు పిలుపునిచ్చాయి. ఈ సమ్మెను విజయవంతం చేయాలని కోరుతూ ఆదివారం డాబాగార్డెన్స్‌లోని అల్లూరి విజ్ఞాన కేంద్రంలో సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో సిటు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీహెచ్ నరసింగరావు, ఏఐటీయూసీ నాయకుడు డి.ఆదినారాయణ, ఐఎన్‌టీయూసీ నాయకుడు మంత్రి రాజశేఖర్, సీఎఫ్‌టీయూఐ అధ్యక్షుడు ఎస్.కనకారావు, హెచ్ఎంఎస్ నాయకుడు గణపతిరెడ్డి, ఏపీఎఫ్‌టీయూ నాయకుడు దేవా మాట్లాడారు. కేంద్రంలోని ఎన్‌డీఏ ప్రభుత్వం కార్మిక వ్యతిరేక విధానాలు అవలంబిస్తోందని, దీని వల్ల నిరుద్యోగం పెరిగి, ఉద్యోగ భద్రత తగ్గిందని విమర్శించారు. కార్పొరేట్లకు అనుకూలంగా వ్యవహరిస్తూ, 44 కార్మిక చట్టాలను 4 లేబర్ కోడ్స్‌గా మార్చడం ద్వారా కార్మికుల హక్కులను కాలరాస్తోందని ఆరోపించారు. ఈ కోడ్స్ అమలైతే పని గంటలు 8 నుంచి 15కి పెరిగే ప్రమాదం ఉందని, కార్మికులు సంఘం నెలకొల్పడం, సమ్మె చేయడం, వేతనాల కోసం పోరాడే హక్కులు కోల్పోతామని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వ రంగ సంస్థలైన రైల్వే, పోర్టులు, విమానాశ్రయాలు, బ్యాంకులు మొదలైనవాటిని ప్రైవేటీకరించడాన్ని తీవ్రంగా వ్యతిరేకించారు. లేబర్ కోడ్స్ రద్దు చేయాలని, ప్రైవేటీకరణ ఆపాలని, కనీస వేతనం నెలకు రూ.26,000 ఇవ్వాలని, ఫిక్స్‌డ్ టర్మ్ ఎంప్లాయిమెంట్, అగ్నిపథ్ రద్దు చేయాలని, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, ప్రభుత్వ రంగంలో ఖాళీలను భర్తీ చేయాలని వారు డిమాండ్ చేశారు. మే 3 లోపు పరిశ్రమల వారీగా సమ్మె నోటీసులు ఇవ్వాలని, 10 లోపు జిల్లా, మండల, పట్టణ స్థాయి సదస్సులు నిర్వహించాలని, 16 నుంచి 19 వరకు ప్రచార యాత్రలు చేపట్టాలని, మే 20న భారీ ప్రదర్శనలు, సభలు నిర్వహించాలని కార్యాచరణను ప్రకటించారు. ఈ సమ్మెకు సంయుక్త కిసాన్ మోర్చా ఆధ్వర్యంలోని రైతు సంఘాలు కూడా గ్రామీణ హర్తాళ్‌కు పిలుపునిచ్చినట్లు తెలిపారు. సమ్మెలో అన్ని రంగాల కార్మికులు, ఉద్యోగులు, వ్యాపారులు స్వచ్ఛందంగా పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో ఆర్‌కేఎస్‌వీ కుమార్, బి.నాగభూషణం, మన్మధరావు, ఆయా యూనియన్ నాయకులు, ఉద్యోగులు పాల్గొన్నారు.



విశాఖ చేరుకున్న ప్రపంచ యాత్రికుడు



ప్రపంచ యాత్రికుడిని అభినందిస్తున్న సనపల వరప్రసాద్, తదితరులు

మురళీనగర్: పశ్చిమ బెంగాల్ రాష్ట్రం ముర్షిదాబాద్ నుంచి సైకిల్‌పై ప్రపంచ యాత్ర చేస్తున్న యువకుడు ఆదివారం మాధవధార చేరుకున్నాడు. ఆయనకు మురళీనగర్ రెసిడెంట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు సనపల వరప్రసాద్ ఆధ్వర్యంలో స్థానికులు స్వాగతం పలికి అభినందించారు. ఈ సందర్భంగా యువకుడితో కాసేపు ముచ్చటించారు. యాత్రలో ఎదురైన ఇబ్బందులు, ఆహ్లాదకరమైన సంఘటనలు ఆయన వివరించారు. ప్రపంచాన్ని చుట్టడం అనేది తన ఆశయమని అతడు వివరించారు. యాత్రికునికి పండ్లు, పండ్ల రసాలను అందజేశారు.

ప్రభుత్వ భూమి కబ్జా కాలేదు

- అధికారుల విచారణలో స్పష్టం
- మాజీ డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్

జగదాంబ: ఆనందపురం మండలం గిడిజాల భూవివాదంపై కలెక్టర్ ఆదేశాల మేరకు జరిగిన సమగ్ర విచారణలో ఎటువంటి ప్రభుత్వ భూమి కబ్జాకు గురికాలేదని తేలినట్లు జీవీఎంసీ మాజీ డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ తెలిపారు. ఈ విషయమై గతంలో తాను కలెక్టర్‌ను కలిసి ఫిర్యాదు చేశానని, దీనిపై సమగ్ర విచారణ జరిపించాలని కోరినట్టు పేర్కొన్నారు. తన ఫిర్యాదు మేరకు స్పందించి విచారణ జరిపిన కలెక్టర్, జేసీ, ఆర్డీవోలకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ నెల 23న విలేకరుల సమావేశంలోనూ ఈ విషయాన్ని ప్రస్తావించినట్టు ఆదివారం విడుదల చేసిన ప్రకటనలో శ్రీధర్ వెల్లడించారు. గిడిజాల భూమి విషయంలో విచారణలో వాస్తవాలు వెలుగు చూశాయని, ఎటువంటి ఆక్రమణలు జరగలేదని స్పష్టమైందన్నారు. ఈ విషయంపై సీఎం, డిప్యూటీ సీఎం కూడా దృష్టి సారించాలని గతంలోనే కోరినట్లు శ్రీధర్ తెలిపారు.

వక్ఫ్‌బోర్డు సవరణ చట్టాన్ని రద్దు చేయాలి



ఉగ్రదాడి మృతులకు నివాళిగా జాతీయ జెండాను ప్రదర్శిస్తున్న సున్నీ ఫెడరేషన్ సభ్యులు

తాటిచెట్లపాలెం: ఇటీవల కశ్మీర్ పహల్గామ్‌లో జరిగిన ఉగ్రదాడిలో మరణించిన వారికి సున్నీ ఫెడరేషన్ ఆఫ్ ఆల్ మసీద్ ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా నివాళులర్పించారు. టీఎస్ఎన్ కాలనీలోని ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో ఆదివారం వీరు ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఉగ్రదాడిలో మృతులకు సంఘీభావంగా చిన్నారులు, పెద్దలు, మహిళలు జాతీయ పతాకాన్ని ప్రదర్శించారు. అనంతరం జరిగిన సమావేశంలో సున్నీ ఫెడరేషన్ సభ్యులు మాట్లాడుతూ వక్ఫ్ బోర్డు సవరణ యాక్ట్–2025ను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. పూర్వీకులు 4, 5 శతాబ్దాల కిందట ఆస్తులను అల్లా పేరున వక్ఫ్(దానం) చేశారని, వాటిని పేదలకు, వితంతువులకు ఉపయోగపడే చూడాలని వారు కోరారు. వక్ఫ్ బోర్డు సవరణ చట్టాన్ని రద్దు చేయాలన్నారు. కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షుడు అహ్మదుల్లా ఖాన్, జనరల్ సెక్రటరీ ఎస్.కె.నూర్ అహ్మద్, హైదర్ ఆలీ సింకా, ఎస్.కె.అహ్మద్ వల్లీ, రహ్మతుల్లా బేగ్, మీర్ అబ్బాస్ హుస్సేన్, మునీర్‌ఖాన్, రహమతుల్లా, సయ్యద్ అమీర్‌ఖాన్, మహబూబ్ షరీఫ్, హమ్మద్ హబీబ్, లుక్మాన్ పాల్గొన్నారు.

విశాఖ బులియన్

24 క్యారెట్స్(10 గ్రా.)	రూ.98,210
22 క్యారెట్స్(10 గ్రా.)	రూ.90,020
వెండి(కిలో):	రూ.1,11,900

చికెన్ ధరలు



చికెన్ (కిలో) (వెన్‌కాబ్)

ఫారం ధర	: రూ.105
బ్రాయిలర్ (లైవ్)	: రూ.125
స్కిన్	: రూ.220
స్కిన్‌లెస్	: రూ.230

కోడిగుడ్ల ధరలు

రూ.లలో (వందకు)

విశాఖ	430.00
విజయనగరం	434.00
శ్రీకాకుళం	434.00

ఆప్తాల్మిక్ అధికారులకు పదోన్నతులు కల్పించాలి



మాట్లాడుతున్న అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు రఘురామిరెడ్డి

అల్లిపురం: రాష్ట్రంలోని ఆప్తాల్మిక్ అధికారులు గత 39 ఏళ్లుగా ఎటువంటి పదోన్నతులకు నోచుకోకుండానే.. పదవీ విరమణ చేస్తున్నారని ఏపీ ప్రభుత్వ ఆప్తాల్మిక్ అధికారుల అసోసియేషన్ జోన్–1 అధ్యక్షుడు డి.వెంకటరమణ అన్నారు. కలెక్టరేట్ ఆవరణలోని ఎన్జీవో హోం ఆవరణలో ఆదివారం జరిగిన అసోసియేషన్ సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం తమ పదోన్నతులపై తక్షణమే స్పందించాలన్నారు. గతంలో ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రతి ఒక్క ఉద్యోగికి కనీసం రెండు పదోన్నతులు కల్పిస్తామని హామీ ఇచ్చినట్లు గుర్తుచేశారు. రాష్ట్రంలో ఖాళీగా ఉన్న పారా మెడికల్ ఆప్తాల్మిక్ ఆఫీసర్ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని, కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేశారు. అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కె.జె.రఘురామరెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు ఎస్.వసంతరావు, ఎం.ఆర్.కె.దాస్, జోనల్ అధ్యక్షుడు డి.వెంకటరావు, జిల్లా ఎన్జీవో సంఘం అధ్యక్షుడు కె.ఈశ్వరరావు పాల్గొని.. ఈ నెల పదవీ విరమణ చేయనున్న బీవీఎం ప్రసాద్‌ను సన్మానించారు.

పెండింగ్ చలాన్ల వసూళ్ల డ్రైవ్


నగరంలో పోలీసుల విస్తృత తనిఖీలు



బీచ్‌రోడ్డులో వాహనాలు తనిఖీ చేస్తున్న పోలీసులు

ఏయూక్యాంపస్: నగరంలో పోలీసులు విస్తృతంగా వాహనాలను తనిఖీ చేస్తున్నారు. గతంలో విధించిన చలాన్లు చెల్లించని వాహనదారులను గుర్తిస్తున్నారు. వారి నుంచి బకాయిలను వసూలు చేసే పనిలో నిమగ్నమయ్యారు. ఇందులో భాగంగా ఆదివారం బీచ్‌రోడ్డులో పలు వాహనాలను తనిఖీ చేశారు. వాహన పత్రాలు సక్రమంగా లేని, హెల్మెట్ ధరించకుండా ప్రయాణిస్తున్న వారికి జరిమానా విధించారు. భారీగా చలాన్లు పేరుకుపోయిన వాహనచోదకుల నుంచి ఆ రుసుం చెల్లించే విధంగా చర్యలు చేపట్టారు.

మధ్యాహ్నం నిర్మానుష్యం.. సాయంత్రం కిటకిట



మధ్యాహ్నం ఒంటి గంట సమయంలో..

ఏయూక్యాంపస్: నగరంలో ఎండ తీవ్రత బాగా పెరిగింది. ఎండ మంటతో పాటు ఉక్కపోతతో ప్రజలు అల్లాడిపోతున్నారు. మధ్యాహ్న సమయంలో రోడ్లు నిర్మానుష్యంగా మారుతున్నాయి. ఆ సమయంలో సాగర తీరం ఖాళీగానే కనిపిస్తోంది. అయితే సాయంత్రం పరిస్థితి పూర్తిగా మారిపోతుంది. ఆ సమయానికి వాతావరణం కాస్త చల్లబడటంతో బీచ్‌లకు క్యూ కడుతున్నారు. ఆదివారం కావడంతో పెద్ద సంఖ్యలో నగరవాసులు కుటుంబ సభ్యులతో కలిసి బీచ్‌కు చేరుకున్నారు. ఆహ్లాదకరమైన వాతావరణంలో అలల హోరు వింటూ.. ఇసుకలో సేదతీరారు. దీంతో బీచ్ జనాలతో కిటకిటలాడింది. ఆర్.కె.బీచ్‌తో పాటు సాగర్‌నగర్, రుషికొండ, భీమిలి, యారాడ తదితర బీచ్‌లు కూడా సందడిగా కనిపించాయి.

–ఫొటోలు: సాక్షి ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం



సాయంత్రం 5 గంటల సమయంలో..